# గుమాస్తా పునర్జననం



**గుమాస్తాగా** జన్మించిన రామశేషయ్య గుమాస్తాగానే రిటైరు కావలసిన కాలం ఆసన్నమైంది. ఇంకొక వారం రోజులలోనే ఆయన పదవీ విరమణ చెయ్యాలి. ఆయనకు ఒక వైపున ఈ దాస్యంనుండి విముక్తి పొందుతున్నానన్న సంతోషం ఉంది. కాని, ఉద్యోగం ఊడిన తరవాత సంసార సారధ్య మెలాగో అర్థంకాక చాలా బాధ పడుతున్నాడు. ఇలా ఉండగా ఒక రోజున హఠాత్తుగా ఆయనకు జబ్బు చేసింది.

నులకమంచం మీద మాసిన దుప్పటివేసి పదిలంగా పడుకోబెట్టారు రామశేషయ్యను. అంతవరకూ గర్భశత్రువులుగా మసులుతూవచ్చిన తల్లి, భార్య, పిల్లలు ఆయన మంచం చుట్టూ నిలబడి బిక్క మొహాలతో చూస్తున్నారు. గతంలో ఆయనకూ వారికీ మధ్యన డబ్బు సంబంధమైన లావాదేవీలు తప్ప అనుబంధాలేవీ లేవు. ఇప్పుడు తాను మరణశయ్యపై చేరి తనువు చాలిస్తున్న సందర్భంలో లేని అనుబంధాలూ, ఆత్మీయతా కొత్తగా పుట్టుకు వచ్చాయనిపించింది రామశేషయ్యకు. అంతలో హఠాత్తుగా ఆయనకొక ఆలోచన తట్టింది. తాను మరణిస్తే ఈ సంసార బాధ్యత స్వీకరించే దెవరు? రేపు పొద్దున పొయ్యిమీదకు గిన్నె ఎక్కించే దెవరు? తాను మిగిల్చిపోతూన్న అప్పులు తీర్చే దెవరు? అప్పుల వాళ్ళకు శాంతంగా సమాధానాలు ఇచ్చే దెవరు? ఎవరూ లేరు! అందుకే అందరూ ఆయన చుట్టూ చేరారు! ఇది ఆయనమీద ప్రేమా కాదు, వాత్సల్యమూ కాదు!

# నేషనల్ ట్రాన్సిస్టర్



**రు. 68/- లకు మాత్రమే**

అన్ని ట్రాన్సిస్టర్లు **జపాన్‌లో తయారుచేయబడినవి.** పెద్ద రేడియోలాగు పలుకుతుంది. శక్తివంతమైన శబ్దగ్రహణం. **మీరు నడుస్తూండగా సంగీతం వినటానికి** భుజపట్టీతో సప్లయిచేయబడుతున్నది. రెండు సంవత్సరాలు గ్యారంటి. రెండు చార్జి సెల్సుతో పనిచేస్తుంది. వినటానికి సంసిద్ధంగా పంపబడుతుంది. వి.పి.పి ఖర్చులు రు. 4/—లు అదనం. నేడే ఆర్డర్లు చేయండి.

**VERMA CO, (T.W.A.P.) POST BOX NO. 1222, DELHI-6.**


# గుమాస్తా పునర్జననం

మా నాన్న పెళ్ళి చేసుకోలేదా? మా నాన్న గుమాస్తాగా పనిచేసి, సంసారాన్ని పోషించి నన్ను ఇంతవాణ్ణి చెయ్యలేదా? నేనుకూడ గుమాస్తాగా చేరి, సంసారాన్ని సరిదిద్దుకోలేదా? ఈ ఉద్యోగం మనకు వంశపారంపర్యంగా వస్తున్నది. నువ్వు స్కూలుఫైనలు ఇంకోసారి ఫేలయినా నీకీ ఉద్యోగం ఖాయం. అదీగాక, నారుపోసినవాడు నీరు పొయ్యకుండా ఉంటాడా? చెట్టుకు కాయలు చెట్టుకే బరువా? ఆ జగన్నాథుడే రక్షించాలి గాని, మనది ఏముంది?'' అంటూ తండ్రి హితబోధ చేశాడు.

''నాయనా! నీవు ఒక ఇంటివాడవయి, మీరిద్దరూ చిలకా గోరింకల్లా ఉంటే మేము కృష్ణా, రామా అంటూ కన్ను మూస్తామురా. పిల్లలు లేనివాళ్ళకు పున్నామనరకం సంభవిస్తుందిరా. ఆ నరకంనుండి తప్పించుకోడానికైనా నువ్వు పెళ్ళిచేసుకోవాలి, నాయనా!'' అని తల్లి హెచ్చరించింది.

రామశేషయ్య తాళికట్టేటప్పుడు నిజంగా ఎర్రగా, ఇంకా ఎర్రగా కాలిన ఇనపస్తంభాన్ని కౌగలించుకున్నట్లే బాధపడ్డాడు.

గడియారంలో పదిహేను నిమిషాలు పూర్తి అయిన వెంటనే, ''ఇంక చాలు! బయటికి రా!'' అని హెచ్చరించారు యమభటులు. కాని ఆ వేడికి వాడిపోని, ఆ మంటకు కగ్గిపోని ఆ చిరునవ్వు చూసిన యమభటులకు ఆశ్చర్యంకన్నా ఆవేశం, ఆవేశంకన్నా ఆగ్రహం వచ్చేశాయి. ఆయనను సలసలాకాగుతున్న నూనె మూకుడులోకి తోసివేశారు.

రామశేషయ్య ఇప్పుడూ చలించలేదు. హిరణ్యకశిపుడు పెడుతున్న బాధలు సునాయాసంగా అనుభవించిన ప్రహ్లాదుడులా ఆయన ఎంతో ఉత్సాహంగా ఉన్నాడు. సలసలా కాగుతున్న నూనెలో ఆయన గోదావరిలో ఈతలు కొట్టినట్లు ఈదులాడి, మెల్లగా బయటికి వచ్చాడు.

రామశేషయ్యకి ఈ శిక్షలు కేవలం వినోదప్రాయంగా ఉన్నాయి. కారణం ఇక్కడ బాధ్యతలు లేవు. అధికారం చెలాయించే ఆఫీసరు లేడు. నిలువునా కాల్చేసే అప్పులవాళ్ళు లేరు. డబ్బులడిగే తల్లీ, భార్యా, పిల్లలూ లేరు. ఇంతకన్నా స్వర్గం ఇంకెక్కడ ఉంది?

రామశేషయ్యను నూనెమూకుడులోకి తోసేటప్పుడు ఏ నేరానికి ఈ శిక్ష విధించబడిందో యమభటులు చెప్పలేదు. ఆయన అడగనూ లేదు. బహుశః గుమాస్తాగా పుట్టి ఉండి కూడా పెళ్ళి చేసుకున్నందుకు ఆ శిక్ష విధించారనుకున్నాడు. నలభై సంవత్సరాలనుంచి ఏకధాటీగా సలసల కాగుతున్న నూనెమూకుడులో వేగిపోయిన తనకు ఈ ఒక్క పదిహేను నిమిషాలు నూనెమూకుడులో నిలబడటం కష్టమనా? ఎంత వెర్రివాళ్ళు ఈ యమభటులు!

యమలోకంలో ఉన్న శిక్షలన్నీ పూర్తి అయ్యాయి. ''ఇంకేమన్నా ఉన్నాయా?'' అని అడిగాడాయన యమభటుల్ని. వాళ్ళు సిగ్గుతో తలలు వంచుకున్నారు. అనేక సంవత్సరాలనుంచి ఎంతో మందిని శిక్షిస్తున్నారు వాళ్ళు. శిక్ష అనుభవించినవాడు ఎవడూ ప్రాణాలతో నిలబడలేదు. గత్యంతరం లేక యమభటులు రామశేషయ్యతో—





# పొదుపైన కాల్గేట్ బహుళారక్ష టాల్క్‌లో చల్లని, పరిమళ సంపద

మనోహరమైన పరిమళము కలిగి.. ఆశ్చర్యము గొలిపే పొదుపైన ఒక ఉత్తమ టాల్కమ్! మీకు అద్భుతమైన చల్లని, సువాసనతో ఆహ్లాదకరమైన తాజాతనము రోజంతా యిస్తుంది. యింటిల్లిపాదికీ, పసిపాపతో సహా ఎంతో ఉత్తమమైనది

# కాల్గేట్ ఆల్-పర్పస్ టాల్క్

CAPT. G. 3 TEL

"అయ్యా! ఈలోకంలో శిక్ష అనుభవించిన వెంటనే ప్రాణాలు పోవాలి. కాని, మీరు ఇంకా ఇలా నిలబడి ఉండటం చాలా ఆశ్చర్యంగా ఉంది. ఇలాంటి క్లిష్ట పరిస్థితిలో మేము మా రాజు సలహా తీసుకోవాలి. వారి దగ్గిరికి వెడదాం రండి" అని ఆయన్ను యమధర్మరాజు దగ్గిరికి తీసుకుని వెళ్ళారు.

యమధర్మరాజు జరిగినదంతా విన్నాడు. ఆయన ఆశ్చర్యానికి అంతులేదు. అవమాన భారంతో శిరస్సును వంచుకుని నేలచూపులు చూస్తున్నాడు. రామశేషయ్య ఠీవిగానిలబడి విజయగర్వంతో చూస్తున్నాడు.

ఎట్టకేలకు కొంచెం తేరుకుని యమధర్మరాజు, "ఏమేమి! శిక్షలు అనుభవించినా ప్రాణాలు ఇంకా నిలిచి ఉన్నాయా? ఎంత మొండి ప్రాణా లివి! నా అధికారాన్నే అపహాస్యం చేస్తున్నాయా? నా ఘటికి తట్టుకుని నిలబడినవాడు వీ డొక్కడే! వీడికి తగిన శిక్ష విధించాలి" అంటూ ఇటూ అటూ తిరుగుతూ గర్జిస్తూ ఆ భుజంమీద గదాదండాన్ని ఈ భుజం మీదకు మారుస్తూ, కనుబొమలు చిట్లిస్తూ, మీసాలు మెలి పెడుతూ హడావిడి చేస్తున్న సందర్భంలో నిర్భయంగా ఇంకా అక్కడే నిలబడి ఉన్న రామశేషయ్యకు ఒక భావం స్ఫురించింది.

ఏమిటో ఈయన పిచ్చిగాని, ఈ తాటాకు బెదిరింపులకు తానా జడిసేది? పై ఆఫీసునుంచి మందలింపు కాగితం వచ్చినప్పుడు తన ఆఫీసరు చేసే గొడవలో ఇది ఎన్నో వంతు?

యమధర్మరాజు అమాత్యులనూ, అనుచరులనూ పిలిచాడు. రహస్య సమాలోచనలు జరిపాడు. ఏదో కొత్త తీర్మానం తయారయింది. ఆ తీర్మానానికి అప్పీలు లేకుండా దాని చుట్టూ ముళ్ళ కంచెలాంటి నియమాలు తయారయ్యాయి.

సదరు తీర్మానం ప్రకారం రామశేషయ్యను శిక్షించడానికి ఇంక ఏ విధమైన శిక్షలూ యమలోకంలో లేనందున, అన్ని శిక్షలకన్నా పెద్ద శిక్ష నిజానికి భూలోకంలోనే ఉండిపోయినందువల్ల రామశేషయ్యకు ఆఖరి శిక్ష భూలోకంలోనే విధించబడింది. ఈ శిక్ష ఏమంటే రామశేషయ్య తిరిగి భూలోకంలో ఒక్క సంవత్సరం గుమాస్తాగా పనిచెయ్యాలి!

భూలోకంలో రామశేషయ్య ఇంట్లో నులకమంచం మీద వాసిన దుప్పటిపైన రామశేషయ్య శవం చెక్కు చెదరకుండా అలానే ఉంది. దహన సంస్కారానికి పేళ్ళూ, పిడకలూ లేక వాటికి అప్పు పుట్టక తల్లీ, భార్యా, పిల్లలూ దిక్కుతోచక అక్కడే నిలబడి ఉన్నారు. అప్పుల వాళ్ళు అప్పులు ఎలా వసూలు చేసుకోవాలో, ఎవర్ని అడగాలో తెలియక పొద్దుటినుంచీ అక్కడే ఉన్నారు. అట్టి సందర్భంలో రామశేషయ్య మెల్లిగా కళ్ళు విప్పి లేచి కూర్చున్నాడు!

సరిగ్గా అదే సమయానికి ఆఫీసు మనిషి ఫ్యూను సుర్నాథం గబగబా వచ్చి ఒక కాగితం రామశేషయ్యకు ఇచ్చాడు. రామశేషయ్యవంటి ఉత్తమ గుమాస్తాను ఆ తరుణంలో సదరు ఆఫీసు వదులుకునే స్థితిలో లేదని, అందువల్ల ఆయన ఉద్యోగ కాలం ఒక సంవత్సరం పొడిగించబడింది. అయిన వెంటనే యమ[illegible] [illegible] కాగితం సారాంశం! ★


మీ ఆహారమును
ఆరోగ్య ప్రదంగా
Meghdoot రాగి
అడుగు భాగముగల
స్టెయిన్ లెస్ స్టీల్
పాత్రలలో వండుకొండి!



● రాగి అడుగు భాగములతో
ఆహారము కాలిపోదు, మాడిపోదు.
● అవి వేడిని సమముగా వ్యాపించేలా
చేస్తాయి.
● వాటిని శుభ్రపరచుట, శుభ్రముగా
ఉంచుట సులభము...కడిగి
తుడిచివేస్తే చాలును!

రాగి అడుగు భాగముగల స్టెయిన్ లెస్ స్టీల్ పాత్రలు వండుటకు అత్యుత్తమమైనవి. అంతేకాక అవి ఒక జీవితకాలం మన్నుతాయి.
వాటిని నేడే కొనండి. వాటితో వంటవను సరదాగా వుంటుంది...
శ్రమ చేయడము ఎంతో తేలిక!
మీ ప్రాంతములోని ప్రసిద్ధ పాత్రల దుకాణములన్నిటిలోను లభించును.

మహాలక్ష్మి మెటల్ ఇండస్ట్రీస్

192 వి, పండారిపోల్ రోడ్, బొంబాయి-4 ఫోన్ 334036, 335473.

ఈ ట్రేడ్ మార్కుకోసం చూడండి Meghdoot

LFI A...TEL